14-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మా తండ్రి, టీచర్ మరియు సద్గురువు ముగ్గురూ కంబైన్డ్ గా ఉన్నారు అన్నది గుర్తుంచుకున్నా సరే సంతోషపు పాదరసము పైకి ఎక్కుతుంది, వారి శ్రీమతముపై నడుస్తూ ఉంటారు"

ప్రశ్న:- బ్రాహ్మణుల మొదటి లక్షణము ఏమిటి? ఏ విషయములో బ్రాహ్మణులు ప్రావీణ్యులుగా అవ్వాలి?

జవాబు:- బ్రాహ్మణుల మొదటి లక్షణము - చదవడము మరియు చదివించడము. ఎవరికైనా జ్ఞానపు రంగును అంటించడములో చాలా-చాలా ప్రావీణ్యులుగా అవ్వండి. ఎవరైనా అవమానపరిచినా, నిందించినా కానీ, మీరు ప్రయత్నించి చూసినట్లయితే వారిపై ప్రభావము తప్పకుండా పడుతుంది. పాత్రులను చూసి దానము ఇవ్వాలి. అవినాశీ ధనము కూడా వ్యర్థమవ్వకూడదు, అందుకే చాలా అప్రమత్తత కావాలి. ధనాన్ని కూడా ఎవరికైనా జాగ్రత్తగా ఇవ్వాలి.

పాట:- ఎవరైతే ప్రియునితో ఉన్నారో... (జో పియా కే సాథ్ హై...)

ఓం శాంతి. ఈశ్వరీయ విద్యార్థులు ఈ పాటను విన్నారు. పిల్లలైన మీరే ఈశ్వరీయ విద్యార్థులు. అన్ని స్కూళ్ళలోనూ ఈశ్వరీయ విద్యార్థులు ఉంటారని కాదు. అలా కాదు. అక్కడ మనుష్యులు చదివిస్తారు. సన్యాసులు కూడా శాస్త్రాలను వినిపిస్తారు. జ్ఞానాన్ని వాస్తవానికి వర్షము అని అనడం జరగదు. నీటి వర్షము కురుస్తుంది. కానీ ఈ మహిమ గానం చేయబడింది ఎందుకంటే పరమపిత పరమాత్మను జ్ఞానసాగరుడు అని కూడా అనడం జరిగింది. తండ్రి అంటారు - నన్ను జ్ఞాన సాగరుడు, నాలెడ్జ్ ఫుల్ అని కూడా అంటారు. జ్ఞానాన్ని వర్షము, నీరు లేక అమృతము అని పిలవడం జరుగదు. ఏ విధంగా మానస సరోవరము అనే కొలను ఉంది. అమృతసర్ లో కూడా ఒక కొలను ఉంది, దానిని వారు అమృతముగా భావిస్తారు. ఈ విషయాలను తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. చదువును అమృతము లేక వర్షము అని అనరు. అమృతము ఉంటుందని, దాని వల్ల దుఃఖము దూరమవుతుందని భావిస్తారు. వాస్తవానికి ఈ జ్ఞానం ద్వారా మీ దుఃఖాలన్నీ 21 జన్మల కొరకు దూరమవుతాయి. ఎవరైతే ప్రియునితో ఉంటారో వారి కొరకు వర్షము కురుస్తుంది. ఇక్కడ ఈ తండ్రి, టీచర్, సద్గురువు - ముగ్గురూ కంబైన్డ్ గా ఉన్నారు. ఈ ఒక్క విషయాన్ని పిల్లలు గుర్తుంచుకున్నా సరే, సంతోషమనే పాదరసము పైకి ఎక్కుతుంది. కానీ మాయ ఘడియ-ఘడియ మరపింపజేస్తుంది. ఇక్కడ పిల్లలైన మీరు శ్రీమతముపై నడుస్తారు. శ్రీమతము ద్వారా మీరు శ్రేష్ఠముగా అవుతారు. భగవంతుడు ఉన్నతోన్నతుడైన తండ్రి. ఉన్నతోన్నతుడైన తండ్రి యొక్క చదువు ద్వారానే ఉన్నతోన్నతులుగా అవ్వగలుగుతారు. ఇప్పుడు ఎవరైతే ప్రియుని సమ్ముఖముగా కూర్చున్నారో, వారందరూ విద్యార్థులు. ఇక్కడ కూర్చుంటారు, చదువుకొని, ఆ తర్వాత తమ ఇళ్ళకు వెళ్ళాలి. రోజు-రోజుకు విద్యార్థులు ఎంతోమంది అవుతూ ఉంటారు. ఒకవేళ అందరినీ కలిపి ఒకే ఇంట్లో ఉంచాలంటే ఎంత పెద్ద ఇల్లు కావాలి! మొత్తం ఆబూ అంతటినీ ఇల్లుగా తయారుచేసినా కూడా అది సరిపోదు. ఎన్ని సెంటర్లు ఉన్నాయి? ఇప్పుడు ఇంకా తక్కువమందే ఉన్నారు, దీని కన్నా వేలాది రెట్లు పెరిగిపోతారు. ఒక వేయి, రెండు వేలు, 5-7 వేల సెంటర్లు కూడా ఏర్పడగలవు. అప్పుడు ఇంటింటిలోనూ ఈ జ్ఞాన గంగలు జ్ఞాన వర్షాన్ని కురిపిస్తారు. లెక్కలేనంతమంది పిల్లలు తయారవుతారు. ఎక్కడికక్కడ సెంటర్లు తెరుస్తూ ఉంటారు చూడండి. కొందరు గీతా పాఠశాల అన్న పేరును పెడతారు, కొందరు బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము అన్న పేరును పెడతారు. వాస్తవానికి బ్రహ్మకుమారి అన్న పేరును పెట్టడానికి భయపడకూడదు. చాలా మంది పిల్లలు - బి.కే. అన్న పేరును చూసి గొడవ చేస్తారేమోనని భయపడతారు, అందుకే గీతా పాఠశాల అన్న పేరును పెడతారు. గీతా పాఠశాల అన్న పదము సాధారణమైనదే. ఏ విఘ్నాలూ రాకూడదు అని అనుకుంటారు, అందుకే బి.కే. అన్న పేరును మార్చి ఇంకొక రూపములో చూపిస్తారు. వాస్తవానికి విషయము ఒక్కటే. లోపలికి వస్తే, చిత్రాలు మొదలైనవి చూసి - వీరు ఆ బి.కే. లే అని వెంటనే అర్థం చేసుకుంటారు, అందుకే అలా పేరు మార్చవలసిన అవసరం లేదు. దీని ద్వారా - వాస్తవానికి వీరు బ్రహ్మ సంతానమైన బ్రహ్మకుమార-కుమారీలు అని బాగా నిరూపించబడుతుంది. అది మంచిదే కదా. మీరు అందరికీ ఇలా చెప్పవచ్చు - వాస్తవానికి మీరు కూడా బ్రహ్మకుమార-కుమారీలే, మీకు ప్రజాపిత బ్రహ్మ గురించి తెలుసు, వారు మనుష్య సృష్టి రచయిత. నిరాకార పరమపిత పరమాత్మ ఆత్మలకు రచయిత ఏమీ కారు, వారు ఆత్మలకు అనాది తండ్రి. ప్రజాపిత బ్రహ్మ కూడా అనాదియే. ఆత్మల తండ్రి వీరిలోకి వస్తారు, వచ్చి ప్రజలను రచించేందుకు బ్రహ్మను దత్తత తీసుకుంటారు. బ్రహ్మ ద్వారా బ్రాహ్మణ కులాన్ని రచించాలి. ఇది అర్థం చేయించడం ఇంకా సహజము, కానీ భయపడతారు. బి.కే.ల వద్దకు వెళ్ళకండి, గీతా పాఠశాలలకు వెళ్తే వెళ్ళండి అని అంటారు. ఇంటి-ఇంటిలో జ్ఞాన గంగ - ఈ మాట యొక్క

అర్థాన్ని మనుష్యులు అర్థం చేసుకోరు.

భక్తి మార్గంలో నారదుడిని ముఖ్యునిగా చూపిస్తారు. అతను తాళాలు వాయించే భక్తుడు. నిజానికి నారదుడు చిత్రములో చూపించిన రూపము కలవారు ఏమీ కాదు. వాస్తవానికి మీరందరూ కోతులు వలె ఉండేవారు. ముఖము మనిషి వలే, బుద్ధి కోతి వలే ఉండేది. నిజానికి అందరూ నారదులే. అందరూ భక్తులే కదా. ఎప్పటివరకైతే మనం దైవీ గుణాలు కల మనుష్యులుగా అవ్వమో, అప్పటివరకూ మనం లక్ష్మిని వరించలేము అని అర్థం చేసుకోగలరు. పురుషులైనా, స్త్రీలైనా, భక్తులు అందరూ నారదులే. ఈ విధంగా చెప్పడం జరుగుతుంది - మీ బుద్ధిని చూసుకోండి, మీరు కోతి వలే ఉన్నారు ఎందుకంటే మీలో పంచ వికారాలు ఉన్నాయి, అందుకే లక్ష్మిని వరించలేరు. ఇదంతా ఇక్కడి విషయమే. బాబా అర్థం చేయించారు, అందరూ దుశ్శాసనులుగా లేక దుర్యోధనులుగా ఉన్నారు. ద్రౌపదుల యొక్క చీరలను హరిస్తూ ఉంటారు, అందుకే - మమ్మల్ని వివస్త్రగా అవ్వడం నుండి కాపాడండి, రక్షించండి అని మాతలు పిలుస్తూ ఉంటారు. కన్యలు - మా పరువును నిలబెట్టండి గిరిధారి అని అంటారు. పేర్లు ఎన్నో పెట్టారు. మనుష్యుల బుద్ధియోగము శ్రీకృష్ణుని వైపుకు వెళ్ళిపోతుంది. కానీ ఏ దేహధారిని స్మృతి చేసినా వికర్మలు వినాశనమవ్వవు. కేవలం సాక్షాత్కారము పొందాలని కోరుకుంటారు. అచ్ఛా, సాక్షాత్కారము కలిగినా కానీ మనుష్యుల నుండి దేవతలుగా అయ్యే జ్ఞానమైతే లభించదు. ఎప్పుడైతే బ్రాహ్మణులుగా అవుతారో మరియు జ్ఞానాన్ని అర్థం చేసుకుంటారో, అప్పుడే దేవతలుగా అవ్వగలుగుతారు. బ్రాహ్మణులుగా అవ్వడంతో భక్తి దూరమైపోతుంది. మొదట ఒక వారం రోజులు ఇక్కడ ఇవ్వడం ద్వారా మనము మనుష్యులను మందిరయోగ్యులుగా తయారుచేయగలుగుతాము. కానీ సమయమైతే పడుతుంది. మీరు తండ్రితో పాటు ఉన్నారు అన్నది యథార్థము. బాబా వద్దకు వస్తారు, తిరిగి వెళ్ళేటప్పుడు మనసులో ఎంత దుఃఖము కలుగుతుంది! కానీ అందరూ తోడుగా ఉండలేరు. ఇది సాధ్యం కాదు. ఒక్కొక్కరు ఒక్కొక్క చోటు నుండి పరిగెత్తుకుంటూ వస్తారు. ఈ ఆచారము ఇక్కడే ఉంటుంది. సాధు-సన్యాసులు మొదలైనవారి వద్దకు వెళ్ళి లెక్కలేనంతమంది పోగవుతారు. అక్కడ ఎవరూ ఎవరినీ వద్దు అని అనరు. ఇక్కడైతే పవిత్రముగా అయ్యే విషయము ఉంటుంది, అందుకే ఆపుతారు. సన్యాసులలోనైతే కేవలం పురుషులే ఇళ్ళు-వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. ఇక్కడైతే కుమారీలు, మాతలు అందరూ ఉన్నారు. కన్యలకు తల్లి, తండ్రి, డాక్టర్లు మొదలైనవారందరూ - వివాహం చేసుకోకపోతే అనారోగ్యంపాలు అవుతారు అని చెప్తారు. వారికి ఇలా అర్థం చేయించాలి - అరే, సన్యాసులుగా ఎంతమంది అవుతూ ఉంటారు. అక్కడ చాలా చిన్న-చిన్న బ్రహ్మచారులు ఉంటారు, మరి ఆ బ్రహ్మచారులు ఎప్పుడూ రోగగ్రస్థులుగా అవ్వరు కదా, ఇక్కడెందుకు అవుతారు? వివాహం చేసుకోకుండా ఎంతోమంది ఉంటారు. సన్యాసుల పైన కూడా ఎవరూ కేసు వేయలేరు. ఎప్పుడూ ఏ భార్య వారిని ఇంటి ఖర్చు కోసం అడగదు. వారైతే పారిపోతారు, మరి వారి భార్య ఖర్చును ఎక్కడి నుండి తీసుకురాగలదు, అప్పుడు చుట్టుప్రక్కల వారు ఆమెను చూసుకుంటారు. పేదవారు ఎక్కువ పారిపోతారు. దుఃఖితులుగా అయినప్పుడు వైరాగ్యము వస్తుంది. మీరు కూడా దుఃఖితులుగా ఉండేవారు కానీ అది వైరాగ్యము యొక్క విషయము కాదు. మీకు మొదట అరచేతిలో వైకుంఠాన్ని చూపించడం జరుగుతుంది. పవిత్రులుగా అవ్వకుండా వైకుంఠములోకి ఎలా వెళ్ళగలరు? సాహసవంతులుగా అవ్వవలసి ఉంటుంది, అందుకే శివ శక్తి సేన అన్న పేరు ఉంది. శివబాబాతో యోగాన్ని జోడించడం ద్వారా శక్తి లభిస్తుంది. జ్ఞాన ధారణ జరిగిన తర్వాతే సమర్పణ అవ్వాలి. జ్ఞాన ధారణ జరగకపోతే, నష్టోమోహులుగా అవ్వకపోతే మాయ వచ్చి విలవిలలాడేలా చేస్తుంది. వివాహం చేసుకోవాలి అని మనసులో కలిగితే మొత్తం బ్రహ్మకుమారీలందరి పేరు అప్రతిష్ఠపాలు అవుతుంది. మొదట నష్టోమోహులుగా అవ్వవలసి ఉంటుంది. మీరు ఇంతమంది భట్టీలో ఉన్నారు, అయినా కూడా ఎంతోమంది నష్టోమోహులుగా అవ్వలేదు, ఇతరులు గుర్తుకు వస్తూ ఉండేవారు. ఇక్కడి నుండి వెళ్ళారు, మిత్ర-సంబంధీకుల ముఖము చూసారు మరియు మోహితులై కూర్చుండిపోయారు. మోహము చుట్టుముట్టేసింది. ఇది కూడా డ్రామాలో రచింపబడి ఉంది. ఇప్పుడు కూడా తండ్రి అంటారు - మొట్టమొదట నష్టోమోహులుగా అవ్వండి. ఒక్క అతి ప్రియమైన తండ్రికి చెందినవారిగా అవ్వండి. ఏమి జరిగినా సరే, మేమైతే తండ్రి సేవలోనే ఉంటాము. పైకి ఎక్కితే వైకుంఠ రసాన్ని ఆస్వాదిస్తారు, పడిపోతే ముక్కలు-ముక్కలుగా అయిపోతారు అని అంటారు కదా. వదిలి వచ్చేసిన తర్వాత మోహము సతాయించడం అనేది జరుగకూడదు. ఇలా ఎంతోమంది సన్యాసులు వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చేస్తారు. సన్యాసులు ఇంటికి తిరిగి వచ్చేస్తే చుట్టుప్రక్కల వారు అంత గౌరవమివ్వరు. ఇతను కామం కొరకు తిరిగి వచ్చేసారు అని భావిస్తారు. ఇక్కడ కూడా - వీరు పూర్తిగా నష్టోమోహులుగా అవ్వలేదు, వికారాలు చుట్టుముట్టేసాయి అని భావించడం జరుగుతుంది. బాబా వద్ద అన్నపానాదుల ఇబ్బంది ఏమీ లేదు. ప్రారంభం నుండి మొదలుకుని ఎంతగా సంభాళిస్తూ వచ్చారు. ఇక్కడ పేదవారు-షావుకార్లు సమానమే. మమ్మా, బాబా కూడా అందరికీ నేర్పించడానికి పాత్రలు తోమేవారు, ఊడ్చేవారు. దేహాభిమానాన్ని తెంచేందుకు ఇలా చేయడం జరుగుతుంది. సన్యాసులు కూడా ఇలా చేయిస్తారు. ఎవరైనా పెద్ద

వ్యక్తులు ఉంటే, దేహాభిమానాన్ని తెంచేందుకు వారి చేత కట్టెలు మొదలైనవి కొట్టిస్తారు. ఇక్కడైతే చాలా గొప్ప ఆస్తి లభిస్తుంది! ఒక్క క్షణములో 21 జన్మల రాజ్యాధికారము! సన్యాసుల వద్దనైతే ఎటువంటి ప్రాప్తి లేదు. అయితే పవిత్రముగా ఉంటారు, కావున అపవిత్రులు వారి ముందు తల వంచి నమస్కరిస్తారు. ఇది రాజయోగము, విశ్వాధిపతులుగా అవుతారు.

వికారాలలోకి వెళ్ళకూడదు. మీరా కూడా పవిత్రముగా ఉండాలని అనుకునేవారు కదా. ఆమె భక్తి మార్గంలో ఉండేవారు. శ్రీకృష్ణుని సాక్షాత్కారము పొందేవారు. ఆమెకు శ్రీకృష్ణునిపై మనస్సు లగ్నమయ్యింది, కావున ఆమె వికారాలలోకి ఎలా వెళ్తారు? కానీ అది కూడా ఒక్క జన్మకే. ఎక్కువలో ఎక్కువ మీరా మరుసటి జన్మలో కూడా భక్తి మార్గంలోకి వెళ్ళి ఉంటారు. ఆమె భక్తి మార్గంలోకి వెళ్ళారు అని చెప్పవచ్చు ఎందుకంటే అంతిమ మతిని బట్టి గతి ఏర్పడుతుంది. శ్రీకృష్ణునిపై మనస్సు ఉంది కావున ఆమె భక్తురాలిగానే అవుతారు. కానీ భక్తి మార్గంలో ఆమెకు ఏమీ లభించలేదు. జ్ఞాన మార్గంలోనైతే 21 జన్మల వారసత్వము లభిస్తుంది. భక్తి కూడా మొదట శివునికి, ఆ తర్వాత దేవతలకు చేస్తారు. ఇప్పుడు చూడండి - ఎలుక, పిల్లి మొదలైనవాటన్నింటికీ కూడా భక్తి చేయడం మొదలుపెట్టారు. శ్రీకృష్ణుడిని వదిలి హనుమంతుడిని, గణేశుడిని మొదలైనవారిని భక్తి చేయడం మొదలుపెడతారు. సత్య, త్రేతా యుగాలలో కూడా కళలు తగ్గిపోతూ ఉంటాయి మరియు భక్తిలో కూడా కళలు తగ్గిపోతూ ఉంటాయి. ఇప్పుడు ఎందుకూ పనికిరాకుండా ఉన్నారు. ఎప్పుడైతే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందో అప్పుడు తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. అర్ధకల్పం పైకి ఎక్కుతారు, మళ్ళీ అర్ధకల్పం తర్వాత కిందపడడం ప్రారంభమవుతుంది. ఇక పడడం తప్పనిసరి అయినప్పుడు జ్ఞానం తీసుకొని ఏమి చేయాలి అని మనుష్యులు భావిస్తారు. కానీ ఈశ్వరీయ జ్ఞానం లేకుండా మనుష్యులు ఎందుకూ పనికి రారు. నేను, మీరు ఎలా ఉండేవారము, ఏ విలువా లేకుండా ఉండేవారము. జ్ఞానం తప్పకుండా కావాలి. శరీర నిర్వహణార్థము చదువుకుంటారు కదా. కన్యలకు కూడా ఈ రోజుల్లో శరీర నిర్వహణార్థము చదువుకోవలసి వస్తోంది. ఇంతకుముందు ఈ నియమము ఉండేది కాదు. కన్యలు ఇల్లు సంభాళించేవారు, కొడుకులు ఉద్యోగం కొరకు చదువుకునేవారు. ఇప్పుడు అనంతమైన తండ్రి పిల్లలైన మిమ్మల్ని చదివిస్తున్నారు. ఒకవేళ అందరూ ఇక్కడే కూర్చుండిపోతే మరి మిత్ర-సంబంధీకులు మొదలైనవారికి జ్ఞానాన్ని ఎవరు ఇస్తారు? అందుకే వెళ్ళవలసి ఉంటుంది. చదవాలి మరియు చదివించాలి. కొందరు ఏమాత్రమూ చదవరు. అప్పుడు - వీరు మన బ్రాహ్మణ కులానికి చెందినవారు కారు అని భావించాలి. రంగు అంటించడానికి తప్పకుండా ప్రయత్నించాలి. ఇందులో భయపడవలసిన విషయమేమీ లేదు. ప్రయత్నించడం వల్ల ఎవరో ఒకరికి రంగు అంటుకుంటుంది. ఎవరైనా అవమానపరిచినా, నిందించినా సరే, మీరు పురుషార్థము చేసి చూడండి, ఎవరో ఒకరిపై తప్పకుండా ప్రభావము పడుతుంది. తేలు నడిచేటప్పుడు ఏదైనా మెత్తటి వస్తువు కనిపిస్తే అక్కడ కుడుతుంది. పరిశీలిస్తుంది. ఇక్కడ కూడా పిల్లలు చాలా ప్రావీణ్యులుగా అవ్వాలి. అవినాశీ ధనాన్ని ఎవ్వరికీ వ్యర్థముగా ఇవ్వకూడదు. పాత్రులను చూసి దానం చేయాలి. ఒకవేళ ఎవరికైనా దానం ఇస్తే, వారు వికర్మ చేసినట్లయితే దాని పాపం దానమిచ్చినవారి పైకి వస్తుంది. ఇక్కడ చాలా అప్రమత్తంగా ఉండాలి. ధనమైతే ఎవరికైనా చాలా జాగ్రత్తగా అడిగి ఇవ్వాలి. ఇక్కడ ఏవైతే తయారుచేస్తున్నారో, ఇవన్నీ త్వరలో కూలిపోతాయి. ఈ ఇళ్ళు కూడా పిల్లలు ఉండేందుకే తయారయ్యాయి. ఇవన్నీ కూలిపోనున్నాయని మీకు తెలుసు. భూకంపాలు వస్తే మందిరాలు మొదలైనవన్నీ కూలిపోతాయి. మన రాజధానిలో ఇవేవీ ఉండవు. అమెరికా, రష్యా మొదలైనవేవీ ఉండవు. కేవలం భారతఖండము మాత్రమే ఉంటుంది, ఇది మీకు తెలుసు. మిగిలిన ప్రపంచమంతా ఘోర అంధకారములో ఉంది. ఇది బాబా యొక్క ఎంత పెద్ద స్కూలు. ఇందులో టీచర్లు కూడా నంబరువారుగా ఉన్నారు. అందరూ ఒకే సమానముగా ఉండరు. ఇందులో అందరికన్నా పెద్ద టీచర్ శివబాబాయేనని మీరు చూస్తారు. ఆ తరువాత ఈ బ్రహ్మపుత్ర నది ఉన్నారు. త్వమేవ మాతాశ్చ పితా... అని అంటారు కూడా, కావున వీరు తల్లి అయినట్లు కదా. సరస్వతి యొక్క పేరు కూడా ఉంది. బ్రహ్మ రాశిపై బ్రహ్మపుత్ర అన్న పేరు సరైనదే. సాగరము మరియు బ్రహ్మపుత్ర నదుల మేళా జరుగుతుందని కూడా చూపిస్తారు, ఇక్కడ ఇది మళ్ళీ ఆత్మలు మరియు పరమాత్మ యొక్క మేళా, దీని స్మృతిచిహ్నమే భక్తి మార్గములో గానం చేయబడుతుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అత్యంత ప్రియమైన తండ్రికి చెందినవారిగా అయ్యే కన్నా ముందు పూర్తి-పూర్తిగా నష్టోమోహులుగా అవ్వాలి.

ఎప్పుడైతే అవస్థ పక్కాగా అవుతుందో, అప్పుడు సేవలో నిమగ్నమవ్వాలి.

2. ఈ ప్రపంచముపై హృదయపూర్వకమైన వైరాగ్యాన్ని ఉంచి పవిత్రముగా అవ్వడములో ధైర్యవంతులుగా అవ్వాలి. దానాన్ని చాలా అప్రమత్తతతో పాత్రులను చూసి చేయాలి.

వరదానము:- పరిస్థితులను సైడ్ సీన్ లుగా భావిస్తూ వాటిని దాటి వేసి ముందుకు వెళ్ళే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

సదా మీ మాస్టర్ సర్వశక్తివాన్ స్వరూపపు స్మృతిలో ఉన్నట్లయితే ప్రతి పరిస్థితి ఒక సైడ్ సీన్ వలె అనుభవమవుతుంది. పరిస్థితి అని భావించినట్లయితే వ్యాకులత చెందుతారు. కానీ సైడ్ సీన్ అనగా దారిలోని దృశ్యాలుగా భావించినట్లయితే సహజంగా దాటి వేస్తారు ఎందుకంటే దృశ్యాలను చూసినప్పుడు సంతోషం కలుగుతుంది, భయపడరు, విఘ్నము విఘ్నము కాదు, కానీ ముందుకు వెళ్ళేందుకు సాధనము. పరీక్షల ద్వారా క్లాస్ ముందుకు వెళ్తుంది, అందుకే ఎప్పుడూ ఏ విషయంలోనూ ఆగిపోకండి, సదా నేను మాస్టర్ సర్వశక్తివంతుడను - అన్న స్మృతి ద్వారా ఎగిరే కళను అనుభవం చేస్తూ ఉండండి.

స్లోగన్:- ఎటువంటి సహజయోగులుగా అవ్వాలంటే మిమ్మల్ని చూడగానే ఇతరుల యోగము లగ్నమైపోవాలి.